# పాలకవర్గాలు ఆడుతున్న మతతత్వ క్రీడలో శలభాలు కావద్దు

## - ప్రజలకు సిపిఐ(ఎం-ఎల్)పిలుపు

------------------------------------------

బాబ్రీమసీదు అంశంలో భారత సుప్రీంకోర్టు ప్రస్తుతానికి మరో పరిష్కారాన్ని వెలువరించింది. పాలకవర్గ పార్టీలన్నీ ఈ తీర్పును స్వాగతిస్తూ, ఇదే అంతిమ పరిష్కారమన్నట్లు చిత్రించటంతోపాటు, ఈ తీర్పుకు ఘనతను ఆపాదించటంలో తమలో తాము పోటీపడ్డాయి. మతతత్వ ప్రాతిపదికపై ప్రజలలో చీలికలు కల్పించటాన్ని కొనసాగించటానికి బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఈ అంశాన్ని ఉపయోగించుకోనున్నాయనే దానికి ఇదో స్పష్టమైన సూచిక.

దశాబ్దాలుగా బాబ్రీమసీదు అంశం నిద్రాణంగా వుండి, దాదాపు ప్రజలంతా ఈ అంశాన్ని మరచిపోయారు. నూతన ఆర్థిక విధానాలుగా కీర్తించబడే ప్రజావ్యతిరేక, దేశవ్యతిరేక విధానాల పరంపరను సామ్రాజ్యవాద ప్రభువుల ఆదేశాలకనుగుణంగా తలకెత్తుకున్నప్పటినుండి పాలకవర్గాలు, ప్రధాన పాలకవర్గ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ ఈ అంశాన్ని రెచ్చగొడ్తూనే వున్నాయి. తమ ప్రజావ్యతిరేక విధానాలు ప్రజల సామాజిక, ఆర్థిక జీవనంలో ఉత్పాతాన్ని సృష్టిస్తాయని, ఇది ప్రజల ప్రతిఘటనకు దారితీయవచ్చునని పాలకవర్గాలకు తెలుసు. తమ ఈ దుర్మార్గమైన విధానాలనుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు, బాబ్రీ అంశాన్ని ఎగదోసి రెండున్నర దశాబ్దాల కాలంగా ఈ పార్టీలు రెండూ నగ్నంగానూ, ముసుగురూపంలోనూ విభజించే మతతత్వ ఎజెండాతోనే సాగుతున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత బిజెపి, ఆర్ఎస్ఎస్ మరియు కాంగ్రెస్ నాయకులు వెలువరించిన వివిధ ప్రకటనలు, ప్రజలను విభజించేందుకు ఈ అంశం వినియోగించబడుతుందని స్పష్టంచేస్తున్నాయి.

వాస్తవ పరిస్థితుల్లో అందర్నీ సంతృప్తిపరుస్తూ సుప్రీంకోర్టు అతుకులువేసి వెలువరించిన తీర్పు గురించి మాత్రం అందరూ మెచ్చుకోవలసిందే! అయినప్పటికీ ఈ తీర్పులో అంతర్లీనంగావున్న వైరుధ్యాలను ఉపయోగించుకునే పాలకవర్గాల, పాలకవర్గ పార్టీల క్రూరమైన ఎత్తుగడల పట్ల అందరూ అప్రమత్తంగా వుండాలి. ఇదేదో ఆధారరహితమైన అపోహ కాదు; దోపిడీ, అణచివేత వర్గ స్వభావంగా వున్న ఈ పాలకవర్గ పార్టీల ఆచరణ రానున్న రోజుల్లో వెల్లడవటం తథ్యం.

పాలకవర్గాలు, పాలకవర్గ పార్టీలు అమలుచేస్తున్న మతతత్వ విభజన రాజకీయ ఎజెండాలకు బలికావద్దని ప్రజలకు పిలుపునిస్తున్నాము. మత సామరస్యాన్ని కాపాడాలని, గౌరవప్రదమైన జీవనాన్ని సాకారం చేసుకునేందుకు పోరాడవలసిందిగా పిలుపునిస్తున్నాము.

**విప్లవాభినందనలతో**

**2019 నవంబర్ 10**

**విశ్వం**
**ప్రధాన కార్యదర్శి**
**సిపిఐ(ఎం-ఎల్)**

ooo